Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

ఎలాంటి క్లిష్ట పరిస్థితినైనా
చిరునవ్వుతో
ఎదుర్కొనగలవారే గొప్పవారు
- స్వామి వివేకానంద

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 02 | మంగళవారం, 28 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

- ఆగస్టు ఒకటి నుంచి విక్రయాలు
- ప్రజలకు ఊరటనిచ్చిన నిర్ణయం
- రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు



**అమరావతి- సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ బియ్యం విక్రయాలు ప్రారంభం కానున్నాయి. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్యులకు ఊరట కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ధరల నియంత్రణతో పాటు ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావం నుంచి ప్రజలను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన బియ్యం అందుబాటు ధరలో లభించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమం అమలులో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ప్రభుత్వ యంత్రాంగం, బియ్యం మిల్లర్లతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

2లో

### ఎల్‌నినోపై ప్రభావంతో

# అప్రమత్తంగా ఉందాం!

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




**అమరావతి- సూర్య వాస్తవం:**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఏర్పడే వాతావరణ మార్పులపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పరిస్థితులను సమీక్షించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది మొత్తం ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనాలు ఉన్న నేపథ్యంలో ఇప్పటికే చేపట్టిన చర్యలను మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి తెలిపారు. రైతులకు వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, అవసరమైన సూచనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు శాస్త్రీయ సలహాలు అందిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పంట నష్టాలను తగ్గించేందుకు వ్యవసాయ, జలవనరులు, విపత్తు నిర్వహణ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను అప్రమత్తం చేయాలని చెప్పారు. వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ, నీటి వినియోగం వంటి అంశాలపై రైతులకు సకాలంలో సమాచారం చేరేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట రైతులకు సాంకేతిక సహాయం అందించేందుకు అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని స్థాయిల్లో ముందస్తు చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

### బావను పొట్టన పెట్టుకున్న

# జనసేన నేత భార్య



- రాయలచెరువు పేటలో విషాదాంతం
- పోలీసు ఫిర్యాదు తర్వాత బలవన్మరణం

**రామచంద్రపురం- సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలో కుటుంబ కలహాలు, పోలీసు ఫిర్యాదు, అవమాన భావన. చివరకు ఓవ్యక్తి ప్రాణం తీసుకున్న విషాద ఘటన రాయలచెరువుపేట గ్రామంలో తీవ్ర కలకలం రేపింది.గ్రామానికి చెందిన ఎస్. సంజీవి సుబ్రహ్మణ్యం (52)తన మరదలు ఎస్. సునీత (జనసేన నాయకుడి భార్య)తో జరిగిన వివాదం అనంతరం సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామస్తుల కథనం ప్రకారం, ఇంటి పక్కనే నివసించే తమ్ముడు--మరదలి మధ్య జరిగిన గొడవను సుబ్రహ్మణ్యం అడ్డుకుని మందలించగా, తనపై దౌర్జన్యం చేశారని సునీత 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని సుబ్రహ్మణ్యానికి కౌన్సిలింగ్ నిర్వహించి, మహిళలతో గొడవలు పెట్టుకోవద్దని హెచ్చరించి పంపించారు.అయితే అదే రోజు ఈ విషయంపై మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో సునీత మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అనంతరం పోలీసులు సుబ్రహ్మణ్యం, ఆయన భార్య నిర్మల, కుమారుడు ప్రశాంత్ కుమార్, కుమార్తె జయలక్ష్మిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో ఇకపై ఆమె జోలికి వెళ్లబోనని సుబ్రహ్మణ్యం లిఖితపూర్వకంగా రాసి ఇచ్చి ఇంటికి వెళ్లారు. అయితే పోలీసు స్టేషన్‌లో జరిగిన పరిణామాలు, గ్రామస్తుల ముందు ఎదురైన అవమానాన్ని తట్టుకోలేకపోయిన సుబ్రహ్మణ్యం, సోమవారం మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని పంచెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్న కుటుంబ వివాదం చివరకు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకోవడంతో భార్య, పిల్లలు దిక్కుతోచని స్థితిలో మిగిలారు. ఈ ఘటనకు సంబంధించిన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై అధికారిక విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

## ఏపీకి భారీ వర్ష సూచన



**అమరావతి- సూర్య వాస్తవం:** బంగాళా ఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయు గుండం ప్రభావంతో ఆంధ్ర ప్రదేశ్‌లో రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మంగళవారం మన్యం, అల్లూరి సీతారామ రాజు, పోలవరం పరిసర ప్రాంతాలు, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.అదేవిధంగా శ్రీకాకుళం, విజయనగరం, బాపట్ల, శ్రీ సత్య సాయి, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీచే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌ల కింద నిలబడవద్దని APSDMA సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరారు.

## తక్కువ ధరకే
# నాణ్యమైన బియ్యం

(మొదటిపేజీ తరువాయి)

అందించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 130 రైతుబజార్లతో పాటు 500 బియ్యం మిల్లర్ల ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా ఈ బియ్యం అందుబాటులో ఉండనుంది. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యాన్ని కిలో రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిర్ణయించిన ధరలకే బియ్యం అందేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టనున్నారు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ప్రజలకు నాణ్యమైన బియ్యం సరసమైన ధరకు అందించేందుకు బియ్యం మిల్లర్లతో చర్చలు జరిపి పరస్పర అంగీకారంతో ధరలను నిర్ణయించినట్లు పేర్కొంది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుందని ప్రభుత్వం భావిస్తోంది. ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులకు ఇది గణనీయమైన ఊరట కలిగిస్తుందని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమనే విషయాన్ని మరోసారి ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని అధికారులు తెలిపారు.

# విజిలాపురం చెరువుకు జలకళ

### నారా భువనేశ్వరి ఆనందం వ్యక్తం
### హంద్రీ--నీవాతో నిండిన విజిలాపురం చెరువు
### రూ.3,850 కోట్లతో పనులు వేగవంతం
### సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం



**కుప్పం - సూర్య వాస్తవం:** కుప్పం నియోజకవర్గంలోని విజిలాపురం చెరువు హంద్రీ--నీవా ద్వారా వచ్చిన కృష్ణా జలాలతో నిండిపోవడం ఆనందాన్ని కలిగించిందని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కృష్ణా జలాలతో నియోజకవర్గంలోని అనేక చెరువులు జలకళ సంతరించుకోవడం సంతోషకర పరిణామమని తెలిపారు. కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకురావాలని ఇచ్చిన హామీ మేరకు హంద్రీ--నీవా ప్రాజెక్టును చంద్రబాబు యజ్ఞంలా ముందుకు తీసుకెళ్లారని ఆమె అన్నారు. 2014 నుంచి 2019 మధ్యకాలంలో ప్రాజెక్టు పనుల్లో 90 శాతం పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రూ.3,850 కోట్లతో హంద్రీ--నీవా పనులను చేపట్టి 732 కిలోమీటర్ల మేర కృష్ణా జలాలను తరలించడం విశేష విజయమని భువనేశ్వరి పేర్కొన్నారు. గత ఏడాదే పరమసముద్రం వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లి జలహారతి నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమని చెప్పారు. కుప్పం బ్రాంచ్ కాలువ ద్వారా 110 చిన్న నీటి పారుదల చెరువులను నింపినట్లు ఆమె తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 6,300 ఎకరాలకు సాగునీరు, 4.02 లక్షల మందికి తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. చంద్రబాబు సంకల్పం వల్ల కృష్ణా జలాలు తమ ప్రాంతానికి చేరి చెరువులు నిండుతున్నాయని స్థానిక రైతులు, ప్రజలు చెబుతుండటం ఆనందాన్ని కలిగించిందని భువనేశ్వరి పేర్కొన్నారు. సాగునీరు, తాగునీటి సమస్యలు గణనీయంగా తగ్గాయని ప్రజలు చెప్పడం సంతృప్తినిచ్చిందన్నారు. హంద్రీ--నీవా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం ద్వారా కుప్పం నియోజకవర్గంలో వ్యవసాయం, తాగునీటి రంగాల్లో మరింత పురోగతి సాధ్యమవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల పనులు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయని తెలిపారు.



# పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ

### విద్యా ప్రమాణాలపై లోకేష్ సమీక్ష
### విద్యార్థులతో ముఖాముఖి
### మెరుగైన ఫలితాలకు అధికారులకు ఆదేశాలు





**కంకిపాడు- సూర్య వాస్తవం:** కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, బోధన విధానాలపై సమగ్రంగా ఆరా తీశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాల పనితీరును సమీక్షించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన నారా లోకేష్ వారి చదువుల పురోగతి, పరీక్షల సన్నద్ధత, పాఠశాలలో బోధనపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ప్రోత్సహిస్తూ సరదాగా వారితో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతపై కూడా మంత్రి విద్యార్థులను నేరుగా ప్రశ్నించారు. ఆహారం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలుపై వివరాలు తెలుసుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యాస ఫలితాలు ఆశించిన స్థాయిలో లేవని సమీక్షలో గుర్తించిన మంత్రి, అభ్యాస ఫలితాలను మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని పెంపొందించేలా బోధనలో కొత్త విధానాలను అమలు చేయాలని, నిరంతర మూల్యాంకనం చేపట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై మరింత శ్రద్ధ చూపుతూ ప్రాథమిక అంశాల నుంచి పరీక్షల వరకు సమగ్ర శిక్షణ అందించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా ప్రతి పాఠశాల కృషి చేయాలని పేర్కొన్నారు. తనిఖీ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు నిరంతర తనిఖీలు కొనసాగుతాయని నారా లోకేష్ స్పష్టం చేశారు.

# కుప్పంలో భువనేశ్వరి పర్యటన

### టీడీపీ నాయకుడి కుటుంబ సభ్యులతో ముచ్చట
### పాఠశాల ఆవరణలో మొక్క నాటిన నిర్వహణ ట్రస్టీ



**కుప్పం - సూర్య వాస్తవం:** కుప్పం పర్యటనలో భాగంగా నారా భువనేశ్వరి రామకుప్పం మండలంలోని కెంచనబల్ల గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు చూపిన ఆప్యాయత తనను ఎంతో ఆకట్టుకుందని ఆమె పేర్కొన్నారు. అనంతరం కెంచనబల్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన నారా భువనేశ్వరి, పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవికి నమస్కరించారు. తర్వాత విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి చదువులు, యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో నారా భువనేశ్వరి ఒక మొక్కను నాటారు. విద్యార్థులు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, మొక్కలను సంరక్షించాలని సూచించారు. తదనంతరం సింగసముద్రం గ్రామాన్ని సందర్శించిన ఆమె అక్కడి విద్యార్థులతో కూడా కాసేపు సరదాగా గడిపారు. వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకుంటూ వారిని ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నారా భువనేశ్వరి పర్యటన సందర్భంగా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు ఆమెకు స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## విద్యార్థినులకు సైకిళ్లు

# పాఠశాలలకు క్రీడా కిట్లు పంపిణీ

### - రోప్స్ స్వచ్ఛంద సంస్థ సేవలను అభినందించిన నారా భువనేశ్వరి




**కుప్పం- సూర్య వాస్తవం :** రామకుప్పం మండలం లోని పంద్యాలమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని కావలిమడుగు యానాది కాలనీలో రోప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సైకిళ్లు, క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ముఖ్యులు నారా భువనేశ్వరి పాల్గొని లబ్ధిదారులకు సైకిళ్లు, పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. రామకుప్పం మండలంలోని పలు గ్రామాల పర్యటనలో భాగంగా నారా భువనేశ్వరి కావలిమడుగు యానాది కాలనీని సందర్శించారు. కాలనీలోని పలువురు కుటుంబాలను పరామర్శించి, తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రోప్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ డాక్టర్ కె. ధనశేఖరన్, డైరెక్టర్ శ్రీలత సమక్షంలో కాలనీలో 7వ, 8వ తరగతులు చదువుతున్న ఆరుగురు విద్యార్థినులకు ఆరు సైకిళ్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక రెండు పాఠశాలలకు
వాలీబాల్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్ బోర్డు, చెస్, రింగ్ బాల్, స్కిప్పింగ్ తదితర క్రీడా సామగ్రితో కూడిన స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ, గిరిజన గ్రామాల్లో గత ఏడాది కాలంగా రోప్స్ సంస్థ విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, గ్రామాభివృద్ధి రంగాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గిరిజన గ్రామాలకు విస్తరించి, మరింత మంది ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన కుప్పం నియోజకవర్గ నాయకులు పి.ఎస్. మునిరత్నం,
డాక్టర్ సురేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలకు రోప్స్ సంస్థ చైర్మన్ డాక్టర్ కె. ధనశేఖరన్, డైరెక్టర్ శ్రీలతతో పాటు సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి - సూర్య వాస్తవం :** నగర అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు ఇచ్చిన ప్రతి ఎన్నికల హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలు 22ఏ కింద ఉన్నాయని వీటిని వీలైనంత త్వరగా తొలగిస్తామని ఆయన చెప్పారు. సోమవారం ఉదయం ఒకటవ డివిజన్ లోని కొత్తపల్లి పరిధిలోని మస్తాన్ నాయుడు ప్లాట్స్, రవీంద్రనగర్ లలో 71 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి లు ప్రారంభించారు. కొత్తపల్లిలో రోడ్లు నిర్మించి తమను ఆదుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కోరారు. అలాగే రవీంద్రనగర్ లో తాగునీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ తోపాటు ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని స్థానికులు కోరారు. రవీంద్ర నగర్ లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. రోడ్ల నిర్మాణంను ప్రాధాన్యత ఇస్తామని ఆమె చెప్పారు. రవీంద్రనగర్ లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. 22ఏ కింద నగరంలో 17వేల ఇళ్లకు పైగా ఉన్నాయని రవీంద్ర నగర్ తో పాటు నగరంలోని మిగిలిన ప్రాంతాలను 22ఏ నుంచి తొగించే ప్రక్రియను వేగవంతం చేస్తామని ఆయన చెప్పారు. నగర పరిధిలోని చెరువుల పూడిక తీసి సుందరంగా చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో మాస్టర్ ప్లాన్ రోడ్డును వేసి నగరంలోని అంతర్గత రోడ్లను మరిచారని ఆయన ఆరోపించారు. కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ. శ్యాంసుందర్, డీఈ రమణ, మాజీ కార్పొరేటర్ ఎస్.కే.బాబు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ

# ఇంటింటికీ టీడీపీలో కూరపాటి శంకర్ రెడ్డి

### - సమస్యలు తెలుసుకున్న టీడీపీ యువ నేత



**సత్యవేడు- సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమం సత్యవేడు నియోజకవర్గంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ కూరపాటి శంకర్ రెడ్డి సోమవారం సత్యవేడు మేజర్ పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ, కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని ఆయన పేర్కొన్నారు. విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, రైతు సంక్షేమం, యువత ఉపాధి, మౌలిక వసతుల కల్పన వంటి అనేక రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, వినతులను నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు ప్రజల్లో ప్రభుత్వంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసి కూరపాటి విజయలక్ష్మీ చంద్రశేఖర్ రెడ్డి, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువ నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పి ఫోర్ ద్వారా పేదల అభివృద్ధి

### - స్వయం సహాయక సంఘాల ద్వారా చిన్న పరిశ్రమ స్థాపన

### - రాష్ట్ర అభివృద్ధిని ఎవరు ఆపలేరు

**రామకుప్పం- సూర్యవాస్తవం :** కుప్పం నియోజకవర్గం ఉద్యోగ అవకాశాలు కల్పనకు పరిశ్రమను స్థాపించి వారు ఇక్కడే ఉద్యోగ అవకాశాలు చేసుకోవడానికి ప్రభుత్వం ఎన్నో పరిశ్రమలను తీసుకొచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దక్కుతుందని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టి సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. మహిళలతో ముఖాముఖి సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల అభివృద్ధిపై బ్యాంకు రుణాల ద్వారా చిన్నచిన్న పరిశ్రమలు స్థాపించి వారి ఆర్థిక అభివృద్ధికి దోహతపడుతున్నా మన్నారు. పి ఫోర్ ద్వారా నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాలను గుర్తించి వారి ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తామన్నారు. రైతులకు వారి అభివృద్ధికై పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి రాష్ట్రంలో రైతుల సంక్షేమానిపై ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. దేశంలోనే సంక్షేమ పథకాలకు అమలు చేస్తున్న ఘనత రాష్ట్రానికి దక్కుతుందన్నారు. విద్యార్థిని విద్యార్థులకు తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చదువుకై 15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలియజేస్తూ రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల నుండి దాదాపు 80 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని ఆమె ఉద్ఘాటించారు.

# స్థానిక టీడీపీ యువనాయకుడు నుంచి రక్షణ కల్పించండి

### - వైసీపీ యువనేత భానుప్రసాద్



**ఐరాల - సూర్య వాస్తవం :** ఐరాల మండలం మాజీ టీడీపీ కన్వీనర్ వడ్లపాటి గిరిధర్ బాబు నాయుడు నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ పూతలపట్టు నియోజకవర్గం వైసీపీ యువనేత నాంపల్లి భాను ప్రసాద్ ఎస్పీ తుషార్ డూడికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 25 న తన పుట్టినరోజు వేడుకలు జరగకుండా గిరిధర్ బాబు నాయుడు తన అను చరులతో బెదిరింపులకు దిగారని ఆరోపించారు. తమ తమ్ముడి మెడికల్ షాప్, భార్య నడుపుతున్న ఆసుపత్రిపైకి రాత్రి వేళల్లో తనిఖీల పేరిట అధికారులను పంపి వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా, పొలకల సంత గేటు వద్ద తన పుట్టినరోజు బ్యానర్లను చించివేసి, కులం పేరుతో దూషిస్తూ దాడులకు యత్నించారని పేర్కొన్నారు. ఒక దళితునిపై ఇటువంటి అరాచకాలకు పాల్పడుతున్న గిరిధర్ బాబునాయుడిపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అలాగే తమ కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ 'మన ఊరు - మన జెండా'

### - పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం : రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్

### - కేంద్ర నిధుల వివరాలతో క్యూఆర్ కోడ్ స్టిక్కర్ ఏర్పాటు చేస్తాం : బీడీ బాలాజీ



**రేణిగుంట- సూర్య వాస్తవం :** రేణిగుంట పట్టణంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యం లో నిర్వహించిన 'మన ఊరు-మన జెండా' కార్యక్రమంలో పార్టీ జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా మన ఊరు-మన జెండా కన్వీనర్, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ, బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అక్టోబర్ నెలలోగా శ్రీకాళహస్తి అసెంబ్లీ పరిధిలోని ప్రతి పంచాయతీలో 'మన ఊరు-మన జెండా' కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ మాట్లాడుతూ, రేణిగుంట పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు త్వరలో జెండా వద్ద క్యూఆర్ కోడ్ (స్కానర్) స్టిక్కర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. దానిని స్కాన్ చేసి కేంద్ర నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజలు తెలుసుకోవచ్చన్నారు. రేణిగుంట పట్టణంలో బీజేపీ జెండా ఏర్పాటు చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందని, కార్యక్రమం విజయవంతానికి సహకరించిన మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీడీ బాలాజీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేలగల సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సొంగా పురుషోత్తం, మండల అధ్యక్షుడు ప్రేమ్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పీకే గోపి ఆచారి, జిల్లా ఉపాధ్యక్షుడు వేణు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు యతేంద్రనాథ్, నాయకురాలు అన్నపూర్ణమ్మ, యువ మోర్చా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రెయిలీ పుస్తకాల వితరణ



**తిరుపతి- సూర్య వాస్తవం :** శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో సోమవారం దృష్టి లోప ప్రత్యేక ప్రతిభ కలిగిన విద్యార్థుల సౌలభ్యం కోసం కొత్తగా మారిన సిలబస్ కు అనుగుణంగా బ్రైయిలీ లిపిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు కు అందించారు. విజన్ త్రు ఇయర్స్ ఫౌండర్ ఉమా మహేశ్వర రావు తయారు చేసిన మెటీరియల్ ను అమెరికాకు చెందిన మనలోని మనిషి ఫౌండేషన్ ఆర్థిక సహాయ సహకారంతో, పాఠ్య పుస్తకాలు, రెఫరెన్సు పుస్తకాలను బ్రైయిలీ లిపిలో కళాశాల పూర్వ దృష్టి లోపం విద్యార్థి, ప్రస్తుతం కర్నూలు ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్, విజన్ త్రు ఇయర్స్ గ్రూప్, డా. రామిరెడ్డి బాలి రెడ్డి వితరణగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు మాట్లాడుతూ, దృష్టి లోప ప్రత్యేక ప్రతిభ కలిగిన విద్యార్థులకు గత కొన్ని ఏళ్లుగా విజన్ త్రు ఇయర్స్ గ్రూప్ ద్వారా చేస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని, బ్రెయిలీ లిపి పుస్తకాలు విద్యార్థులకు ఒక వరం లాంటివని, అత్యధిక మార్కులు సాదించుటకు, ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి అన్నారు. డా. రామిరెడ్డి బాలి రెడ్డి మాట్లాడుతూ, నూతన రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ పుస్తకాలను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, కర్నూలు మునిసిపల్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్, రామిరెడ్డి శంకరమ్మ, ఇంచార్జి లైబ్రేరియన్, తెలుగు అధ్యాపకురాలు కె. వెంకట రమణమ్మ, అధ్యాపకులు డా. సి. ఎల్. చెన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలి

- కదంతొక్కిన విద్యార్థులు




**పుంగనూరు– సూర్య వాస్తవం :** ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యార్థులు కదంతొక్కారు. ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ర్యాలీ ఇందిరా సర్కిల్ నుంచి ఎంబిటి రోడ్డు, బస్టాండ్, గోకుల్ సర్కిల్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా సంఘ జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకుండ నిర్లక్షం చేస్తోందన్నారు. దేశభవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని, ప్రతి చిన్నారి నాణ్యమైన విద్య పొందడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు. ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు కల్పించాల్సిన హక్కులను తక్షణమే అమలు చేయాలన్నారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ద తీసుకుని, చట్టాన్ని అమలు చేయకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు భార్గవ్‌సాయి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రతినిదులు కోటేశ్వరరావు, వెంకట్రమణారెడ్డి, రామమూర్తి, మున్న, ఓబీసీ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటయాదవ్, సురేష్, పవన్, మునిసాయి తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు గురుపౌర్ణమి వేడుకలు

**పుంగనూరు– సూర్య వాస్తవం :** గురుపౌర్ణమి సందర్భంగా పలు ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలు ఈనెల 29 న నిర్వహించేందుకు సిద్ధం చేశారు. పట్టణంలోని కొత్తయిండ్లలో గల శ్రీ సాయిబాబా ఆలయం, యాబైరాళ్ల మొరవలో గల శ్రీ దత్తపీఠము, చెరువుకట్టపై గల శ్రీసాయిబాబా ఆలయము, బస్టాండులో గల శ్రీ సాయిబాబా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు కంచి నిర్వాహకులు సిద్ధమైయ్యారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, హ్గామాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

## అమరావతి ఛాంపియన్షిప్ సెలక్షన్ ఆటల పోటీలు



**కురబలకోట– సూర్య వాస్తవం :** అమరావతి ఛాంపియన్షిప్ సెలక్షన్ ఆటలు పోటీల సోమవారం కురబలకోట హై స్కూల్లో ప్రారంభించారు. ఈ పోటీలను కురబలకోట ఎంఈఓ ద్వారకనాథ్, హెచ్ఎం శ్రీదేవిలు ప్రారంభించారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని హై స్కూల్ కి చెందిన 17 మరియు 23 సంవత్సరాలు లోపు బాల బాలికలకు వాలీబాల్ చెస్ , హాకి, బాడ్మింటన్, వాలీబాల్ క్రీడల నిర్వహించి ఎంపికలు చేశారు. ఈ పోటీలలో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ హైస్కూల్ కు చెందిన బాల బాలికలు సుమారు 560 మంది పాల్గొన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి చంద్రశేఖర్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు పోటీలను పర్యవేక్షించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎంఈఓ ద్వారకనాథ్ తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు పీడీలు పాల్గొన్నారు.

## కత్తి పద్మారావు జయంతి

- మాలమహానాడు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహణ




**పీలేరు– సూర్య వాస్తవం :** దళిత ఉద్యమ సారథి, ప్రముఖ సామాజిక విప్లవకారుడు, దళిత మహాసభ వ్యవస్థాపకుడు, మహా కవి డాక్టర్ కత్తి పద్మారావు జన్మదిన వేడు కలను మాలమహా నాడు, దళిత వేదిక ఆధ్వర్యంలో సోమవారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు కార్యాలయంలో నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం డాక్టర్ కత్తి పద్మారావు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ, కారంచేడు, చుండూరు వంటి చారిత్రాత్మక దళిత ఆత్మగౌరవ పోరాటాలకు డాక్టర్ కత్తి పద్మారావు ధైర్యంగా నాయకత్వం వహించారని కొనియాడారు. అణగారిన వర్గాల రాజ్యాధికారం, సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన ఉద్యమాలు, రచించిన సాహిత్యం, చేసిన ప్రసంగాలు దళిత బహుజన సమాజంలో విశేష చైతన్యాన్ని నింపాయని అన్నారు. బౌద్ధ, అంబేడ్కర్ తాత్విక భావజాలాన్ని ఆధారంగా చేసుకుని సమానత్వ సమాజ నిర్మాణం కోసం కత్తి పద్మారావు చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంతో పాటు అణగారిన వర్గాల ఐక్యత, సామాజిక న్యాయం కోసం మాలమహానాడు నిరంతరం ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి మల్లికార్జున, దళిత వేదిక అన్నమయ్య జిల్లా కన్వీనర్ గుండ్లూరు ఇరగన్న, మాలమహానాడు మండల కార్యదర్శి తుమ్మల రవి కుమార్, ప్రచార కార్యదర్శి గొడుగు చింతల రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు డెంగ్యూపై ప్రత్యేక అవగాహన

- సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య




**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందుల అర్బన్ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సమీకృత బాలికల వసతి గృహంలో 'డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల' సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన వివరిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుపై డెంగ్యూ చూపే ప్రభావాన్ని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ"డెంగ్యూ జ్వరం వస్తే విద్యార్థులు రోజువారీగా స్కూల్‌కు వెళ్లడం కష్టమవుతుంది. దీనివల్ల ఉపాధ్యాయులు చెప్పే ముఖ్యమైన పాఠాలను వినే అవకాశం కోల్పోతారు. రోజులు తరబడి బడికి దూరమవ్వడం వల్ల చదువులో వెనుకబడిపోయే ప్రమాదం ఉంది. అందుకే ప్రతి విద్యార్థి దోమ కాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని తెలిపారు. సాధారణ దోమల లాగా కాకుండా డెంగ్యూని వ్యాప్తి చేసే 'ఈడిస్' రకం దోమలు ప్రధానంగా పగటిపూటే (ఉదయం, సాయంత్రం వేళల్లో) కుడతాయని, కాబట్టి చదువుకునే సమయంలో, ఆడుకునేటప్పుడు కాళ్లు, చేతులు పూర్తిగా కప్పేలా పొడవాటి దుస్తులు ధరించాలని ఆయన సూచించారు. డెంగ్యూ దోమలు మంచి నీటిలోనే గ్రుడ్లు పెట్టి పెరుగుతాయి. కాబట్టి హాస్టల్లోని బకెట్లు, డ్రమ్ములు, వాటర్ కూలర్లలో నీటిని రోజులు తరబడి నిల్వ ఉంచకూడదు. వారానికి ఒకరోజు హాస్టల్‌లోని నీటి పాత్రలను ఖాళీ చేసి, బాగా తోమి ఆరబెట్టిన తర్వాతే కొత్త నీటిని నింపుకోవాలి.హాస్టల్ ఆవరణలో వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ కప్పులు, కొబ్బరి బొబ్బలు పడేయకూడదు. వర్షపు నీరు వాటిలో చేరితే దోమలు త్వరగా వ్యాప్తి చెందుతాయి. రాత్రిపూట పడుకునే సమయంలో తప్పనిసరిగా దోమతెరలు వాడాలి.జ్వరం, తీవ్రమైన తలనొప్పి లేదా ఒళ్లు నొప్పులు అనిపిస్తే సమయం వృథా చేయకుండా వెంటనే హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లి వైద్య సహాయం పొందాలి. ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలమని, హాస్టల్‌ను డెంగ్యూ రహితంగా మార్చడంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శేషగిరి నాయక్ వసతి గృహ సంక్షేమాధికారి లక్ష్మి, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### మిట్స్ ఎన్‌సీసీ క్యాండెట్లు

# ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌కు ఎంపిక




**కురబలకోట– సూర్యవాస్తవం :** మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ విభాగం విద్యార్థులు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్లో పాల్గొన్నట్లు వైస్ ఛాన్సలర్ తెలిపారు. 35(ఏ) ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ, చిత్తూరు ఆధ్వర్యంలో, తిరుపతి గ్రూప్ నుంచి ఎంపికైన మిట్స్‌కు చెందిన 10 మంది క్యాడెట్లు 20 మద్రాస్ రెజిమెంట్లో 76 ఇన్‌ఫెంట్రీ నిర్వహించిన పది రోజుల ఆర్మీ అటాచ్‌మెంట్, సికింద్రాబాద్ శిక్షణా శిబిరంలో విజయవంతంగా పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరంలో క్యాడెట్లు భారత సైన్యం జీవన విధానం, క్రమశిక్షణ, యుద్ధ పరిస్థితుల్లో సైనికులు అనుసరించే విధానాలు, సైనిక కార్యకలాపాలకు సంబంధించిన అంశాలను ప్రత్యక్షంగా అభ్యసించారు. అలాగే ఎస్ఐజీ, ఇన్‌సాస్ వంటి ఆధునిక ఆయుధాల వినియోగం, వాటి సాంకేతిక విశేషాలపై అవగాహన పొందారు. అదనంగా మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, యుద్ధ వ్యూహాలు, సైనిక విన్యాసాలు, యుద్ధ సమయంలో అనుసరించే విధానాలపై శిక్షణను పొందారు.

ఈ జాతీయ స్థాయి ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌లో పాల్గొనడం ద్వారా క్యాడెట్లలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి మరింత పెంపొందాయని వైస్ ఛాన్సలర్ తెలిపారు. అలాగే ఈ శిక్షణ ఎన్‌సీసీ 'బి' మరియు 'సి' సర్టిఫికెట్ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మిట్స్ క్యాడెట్లు జాతీయ స్థాయి ఆర్మీ శిక్షణా శిబిరంలో పాల్గొనడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన 35 (ఏ) ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ, చిత్తూరు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్.వి. మోనిస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి. లోగనాథన్, అలాగే ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్, తిరుపతి అధికారులకు క్యాడెట్లు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌లో విజయవంతంగా పాల్గొన్న క్యాడెట్లను మిట్స్ ఫౌండర్ & ఛాన్సలర్ డా. ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్. ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల,లు అభినందించారు.

# డాక్టర్ జి.ఇందాదుల్లాకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

- నూర్ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్ డిమాండ్



**పీలేరు– సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ జి. ఇందాదుల్లాకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని రాష్ట్ర నూర్ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. సోమవారం పీలేరులో డాక్టర్ జి. ఇందాదుల్లాను రాష్ట్ర నూర్ భాషా సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీర్ మహమ్మద్ మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూర్ భాషా వర్గానికి రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలను ఇప్పుడు అమలు చేసే సమయం ఆసన్నమైందని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి డాక్టర్ జి. ఇందాదుల్లా విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. నూర్ భాషా వర్గాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఏకతాటిపైకి తీసుకురావడంతో పాటు పార్టీ విజయానికి తన వంతు సహకారం అందించారని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ఆర్థికంగా, రాజకీయంగా నిరంతరం సేవలందించిన ఆయనకు ఎమ్మెల్సీ పదవి కేటాయించడం ద్వారా నూర్ భాషా వర్గానికి సముచిత గౌరవం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. అందువల్ల డాక్టర్ జి.ఇందాదుల్లాకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఎన్నికల సమయంలో నూర్ భాషా వర్గానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకుని, ఆ వర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నూర్ భాషా సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అవకతవకలపై

# విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి

## - వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి



**గుంతకల్లు– సూర్య వాస్తవం :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, గుంతకల్లు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై. వెంకట్రామిరెడ్డి సూచనలతో వైఎస్సార్సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో గుంతకల్లు వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతి రెడ్డి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేసిన పోరాటాల నేపథ్యంలో నీట్ (చీజుజు) పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఆ వ్యవహారంపై పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో యువతకు హామీ ఇచ్చిన నెలకు ?3,000 నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 28 వ తేదీన అనంతపురంలో విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన ర్యాలీలో విద్యార్థులు, నిరుద్యోగ యువత, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విద్యార్థి, రాష్ట్ర నాయకులు బి వంశీ యాదవ్ నక్క నారప్ప యువజన విభాగాల నాయకులు, పట్టణ, మండల అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు, మహిళా నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, విద్యార్థులు

# నీట్ పేపర్ లీక్ వల్ల

# ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు పరిహారం ఇవ్వాలి

## - దేశవ్యాప్తంగా ఆందోళన పాల్గొన్న విద్యార్థుల పైన పెట్టిన కేసులు బే షరతుగా కొట్టివేయాలి

## - ఎన్‌టీఏను రద్దు చేయాలని పులివెందులలో సిపిఐ నిరసన




**పులివెందుల– సూర్య వాస్తవం :** నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వల్ల మరణించిన విద్యార్థి కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు పరిహారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు డిమాండ్ చేశారు సోమవారం ఉదయం స్థానిక ఎన్జీవో సర్కిల్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ పులివెందుల ఏరియా సమితి ఆధ్వర్యంలో చనిపోయిన విద్యార్థులకు నివాళులర్పిస్తూ వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఎన్ టి ఏ ను రద్దుచేసి పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు అప్పజెప్పాలని, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మాఫియాలను అరికట్టాలని, మరియు ప్రక్షాళన చేయాలని ఆయన కోరారు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళన చేసిన వారిపై పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎన్ టీ ఏ , చీజూ ల రద్దు చేయాలని పారదర్శక పరీక్ష విధానాన్ని ప్రవేశపెట్టాలని 2020 లో ప్రవేశపెట్టిన కమ్యూనల్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ని వెంటనే ఉపసహించుకోవాలని డిమాండ్ చేశారు సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు మాట్లాడుతూ జాతీయ పరీక్షలలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 49 రోజులపాటు విద్యార్థులు, యువకులు, వారి తల్లిదండ్రులు పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని ఈ ఉద్యమాన్ని విజయవంతం చేశారని తెలియజేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ కాకుండా దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, యువత రోడ్డెక్కి ఆందోళన చేపట్టిన ఫలితంగానే కేంద్ర విద్యాశాఖా మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం జరిగింది. ఇది విద్యార్థులు సాధించిన ఘన విజయం. ఈ మహోద్యమంలో పాల్గొన్న విద్యార్థి లోకానికి అభినందనలు తెలియజేశారు. ధర్మేంద్ర ప్రధాన్ స్థానంలో కేంద్ర విద్యాశాఖామంత్రిగా మరో బిజెపి నాయకుడైన ప్రహ్లాద్ జోషిని తీసుకురావడం సమంజసం సమంజసం కాదని. భారతదేశ రాజ్యాంగం, లౌకికవాదం విద్యారంగంలో చోటుచేసుకోవాలంటే ఖచ్చితంగా కేంద్ర విద్యా శాఖా మంత్రి పదవిని బిజెపికి చెందిన వారికి కాకుండా ఎన్డిఏలో ఉన్న లౌకిక పార్టీలైన తెలుగుదేశం లేదా జెడియులకు ఇవ్వాలని ప్రధాని నరేంద్రమోడీని డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ టి యు సి పులివెందుల ఏరియా కార్యదర్శి బ్రహ్మం, సిపిఐ వేముల మండల కార్యదర్శి చాంద్ బాషా, సిపిఐ నాయకులు రాజా, పులివెందుల సుభాన్ భాష, సిపిఐ వేంపల్లి నాయకులు జకరయ్య, యువజన సంఘ నాయకులు రూపకాంత్, గణేష్ పాల్గొన్నారు.

# ఎర్రచందనం దుంగలు స్వాధీనం



**సుండుపల్లి– సూర్య వాస్తవం :** శేషాచల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న 7 ఎర్రచందనం దుంగలను వాహనంతో పాటు అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నిందితులు పరారయ్యారని సానిపాయి రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా డీఎఫ్ఓ, మదనపల్లె సబ్ డీఎఫ్ఓ పర్యవేక్షణలో సానిపాయి రేంజ్ సిబ్బంది, రేంజ్ బేస్ క్యాంప్ సిబ్బంది సంయుక్తంగా రేంజ్ పరిధిలోని అన్ని రహదారులపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ముడుంపాడు బీట్ పరిధిలోని తిప్పబావి ప్రాంతంలో అనుమానాస్పదంగా వస్తున్న ఓ ఇన్నోవా వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా, డ్రైవర్ ఆగకుండా వేగంగా దూసుకెళ్లాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఇతర సిబ్బందికి సమాచారం అందించారు. వాహనం కొత్తపల్లి బండ మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించగా, గుండ్లపల్లి సమీపంలో రహదారిపై రాళ్లు అడ్డంగా ఉంచడంతో వాహనం నిలిచిపోయింది. అయితే అందులోని నిందితులు చీకటిని ఆసరాగా చేసుకుని పరారయ్యారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 7 ఎర్రచందనం దుంగలు (మొత్తం 112 కిలోలు) లభ్యమయ్యాయి. వాటితో పాటు ఏపీ 39 ఎన్ఎం 1493 (మార్చిన నంబర్ ప్లేట్), అసలు టీఎన్ 04 ఏఎమ్ 0801 నంబరు గల ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రేంజర్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ దాడిలో రాయవరం డీఆర్వో రమేష్‌బాబు, ఎఫ్‌బీఓలు లీలా (ముడుంపాడు), శ్రీహరి (జిల్లెళ్లమండ), వెంకటేశ్వర్లు (జాండ్రపెంట), అనిల్‌కుమార్ (దిన్నెల), సుబ్బారెడ్డి తదితర అటవీశాఖ సిబ్బంది, రేంజ్ బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో 396 రద్దు చేయాలి

## - డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

## - దీక్షకు వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతి రెడ్డి మద్దతు




**గుంతకల్ – సూర్య వాస్తవం :** డాక్యుమెంట్ రైటర్ల హక్కులు, ఉపాధికి విఘాతం కలిగించే జీవో నెం. 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పెన్‌డౌన్ దీక్షకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంఘీభావం తెలిపింది. మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో గుంతకల్ సబ్–రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొని డాక్యుమెంట్ రైటర్లకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వై. నైరుతి రెడ్డి మాట్లాడుతూ, జీవో 396 వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధి ప్రమాదంలో పడిందన్నారు. ఉపాధిని దెబ్బతీసే ఈ జీవోను కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డాక్యుమెంట్ రైటర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకు వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత వర్గాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జీవోను రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పట్టణ, మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు, డాక్యుమెంట్ రైటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

# ప్రభుత్వం మాజీ సైనికుల

# న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

## - గుండెకు ఎదురుగా గుండె నిలిపిన మాజీ సైనికుల పోరాటానికి వైసీపీ సంపూర్ణ మద్దతు - ఎస్. నిసార్ అహమద్



**మదనపల్లె – సూర్య వాస్తవం :** దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన మాజీ సైనికులు న్యాయమైన హక్కుల సాధన కోసం చేస్తున్న ఉద్యమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమద్ తెలిపారు. మదనపల్లెలో మాజీ సైనికులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, దేశ సరిహద్దుల్లో అపార త్యాగాలు చేసిన మాజీ సైనికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత బాధాకరమన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, వారికి తగిన గౌరవం, భద్రత, సంక్షేమాన్ని ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా వివాదంలో ఉన్న సైనిక భవన్ కు కేటాయించిన స్థలాన్ని మాజీ సైనికులకు అప్పగించాలని, వెంకప్పకోటలో మాజీ సైనికులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెంటనే వారికి అందించాలని డిమాండ్ చేశారు. మదనపల్లె మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ జింకా చలపతి మాట్లాడుతూ దేశ భద్రత కోసం జీవితాలను అంకితం చేసిన మాజీ సైనికుల పట్ల సమాజం, ప్రభుత్వాలు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. వారి పోరాటం రాజకీయాలకు అతీతమైనదని, న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి. ఎస్. రెడ్డి, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్, కార్యదర్శి ఎస్.కె. ఇర్ఫాన్, యువజన నాయకులు హేమంత్, నాగరాజ రెడ్డి, యోగానంద రెడ్డి, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, నాగిరెడ్డి, ఎన్. నవాజ్, తాళే సుబ్రహ్మణ్యం, షేక్ జబి లతో పాటు అనుబంధ విభాగాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాజీ సైనికులకు సంఘీభావం తెలిపారు.

# డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



**సుండుపల్లి– సూర్య వాస్తవం :** డెంగీ నివారణ మాసోత్సవాల సందర్భంగా రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి సబ్ యూనిట్ అధికారి స్వామిదాస్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా స్వామిదాస్ మాట్లాడుతూ, జూలై నెల నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున డెంగీ జ్వరాల వ్యాప్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. డెంగీని నివారించేందుకు కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఇంట్లోని నీటి పాత్రలను తరచూ పరిశీలించి, వాటికి మూతలు పెట్టడంతో పాటు వారానికి ఒకసారి శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు ఉపయోగించాలని, ఆకస్మికంగా అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఎముకలు, కండరాల నొప్పులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రూబీనా, డాక్టర్ శేఖర్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, హెచ్ఈ సుగుణమ్మ, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, సీహెచ్ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# భూముల పేరుతో మోసాలు

**- బాధితులు శివశంకర్ రెడ్డి, సావిత్రమ్మ**




**తిరుపతి ప్రెస్ క్లబ్ - సూర్య వాస్తవం :** భూములు ఇప్పిస్తామని నమ్మించి లక్ష రూపాయలు తీసుకొని సంవత్సరాలు గడిచినా భూములు ఇవ్వకపోవడంతో పాటు డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు శివశంకర్ రెడ్డి, సావిత్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వాటి ఇరువురు మాట్లాడారు. మాట్లాడుతూ 2020 సంవత్సరంలో సర్వే నంబర్ 5501/ 11 కు సంబంధించిన భూమిని ఇప్పిస్తామని సిద్ధరామయ్య 9 లక్షలు తీసుకొన్నారని, భూమి ఇవ్వకపోగా డబ్బులు తిరిగి ఇవ్వలేదని, ఇస్తాను చేస్తాను అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సావిత్రమ్మ మాట్లాడుతూ తన వద్ద నుండి సిద్దరామయ్య, జగన్నాథం అనే వ్యక్తులు 25 లక్షలు రూపాయలు తీసుకొని అనేక ప్రాంతాలలో భూములు ఉన్నాయని నమ్మించి పలుమార్లు అగ్రిమెంట్లు మార్చారని, అడిగితే ఇప్పుడు చేతులెత్తేసారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు పోలీసులను, సంబంధిత అధికారులను ఆశ్రయించినప్పటికీ తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొందరి రాజకీయ నాయకుల పేర్లను ప్రస్తావిస్తూ తనను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాధితులకు న్యాయం కోరారు.

# తొలగించిన దొంగ ఓట్లకు వైసీపీ సమాధానం చెప్పాలి

**- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్**




**తిరుపతి ప్రెస్‌క్లబ్ - సూర్య వాస్తవం :** భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్లో భాగంగా పారదర్శకంగా సర్ ప్రక్రియను నిర్వహించి దొంగ ఓట్లను తొలగించారని, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తితో పాటుగా జిల్లాలో తొలగించిన దొంగ ఓట్లపై వైసీపీ సమాధానం చెప్పాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, యాదవ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తిరుపతిలో జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి నాయకులు దొంగ ఓట్లు తయారు చేశారని ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేసామన్నారు. అయితే తాము చేసిన ఫిర్యాదులో పేర్కొన్న దానికన్నా తిరుపతి నియోజకవర్గంలో 90,952 వేల ఓట్లు ఈ ప్రక్రియల తొలగించబడ్డాయన్నారు. అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కై దొంగ ఓట్లు నమోదులో భాగస్వామ్యం అయ్యారని, ఈ ప్రక్రియ ద్వారానే ఎంపీగా గురుమూర్తి గెలిచారని అన్నారు. భారత ఎన్నికల సంఘం దొంగ ఓట్ల నమోదుకు సంబంధించి కీలక పాత్ర పోషించిన సంబంధిత అధికారులు అందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వచ్చామని, ఈ రెండేళ్ల పాలనపై ఇంటింటికి కూటమి ప్రభుత్వ కార్యక్రమం సోమవారం ప్రారంభించామన్నారు. వివిధ పథకాలకు సంబంధించి ఎంతోమంది లక్షల రూపాయలు లబ్ధి పొందాలని చెప్పారు.

# రెండేళ్ల పాలన విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

**- కుప్పం మున్సిపాలిటీలో రెండు సంవత్సరాల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" ప్రచారం ప్రారంభం**



**కుప్పం- సూర్య వాస్తవం :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన "రెండు సంవత్సరాల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" విజయోత్సవ ప్రచార కార్యక్రమాన్ని కుప్పం మున్సిపాలిటీ క్లస్టర్--10 పరిధిలోని 20వ వార్డులో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి, కౌన్సిలర్ ఎస్. సోమశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రాష్ట్ర కార్యదర్శి పి. గోపీనాథ్, 20వ వార్డు అధ్యక్షుడు శ్రీధర్, బూత్ ఇన్‌చార్జి కే. లోకేష్ బాబు, టి.సురేష్, ఆచారి కరుణ, నాయుడు, మున్సిపల్ కార్యదర్శి దేవతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ-క్రాప్ పంట నమోదు ప్రక్రియ



**బుచ్చినాయుడుకండ్రిగ - సూర్య వాస్తవం :** బుచ్చినాయుడు కండ్రిగ మండలం కారణి మిట్ట గ్రామంలో ఈ-క్రాప్ (ఈ-పంట) నమోదు పక్రియ ముమ్మరంగా సాగుతోంది. వ్యవసాయ శాఖ అధికారిని చంద్రమ్మ గారు నేరుగా వరి పొలాల్లోకి వెళ్లి, మొబైల్ లేదా టాబ్లెట్ యాప్ ద్వారా జియో-ట్యాగింగ్ చేస్తూ సాగు వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నారు. ఈ నమోదు ప్రక్రియ ఆధారంగానే రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి, సున్నా వడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా మరియు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇన్పుట్ సబ్సిడీ లేదా పంట నష్టపరిహారం అందుతాయి. పంట వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత, రైతులు తమ మొబైల్ నంబర్‌కు వచ్చే సందేశం ఆధారంగా రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్ కె) తప్పనిసరిగా ఈ-కేవైసీ (ఈ - కెవాయ్ సి) పూర్తి చేసి, ఈ నమోదును ధృవీకరించుకోవాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు సురేంద్ర రెడ్డి, చెంగయ్య తధా తరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల కబ్జాను అడ్డుకోవాలి

**- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ డిమాండ్**




**తిరుపతి ప్రెస్‌క్లబ్ - సూర్య వాస్తవం :** వెంకటగిరి పట్టణం నడిబొడ్డున ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని, విశ్వోదయ క్రీడా మైదానానికి ఆనుకుని ఉన్న తాలూకా సమితి కార్యాలయం కొరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలాలు, ప్రభుత్వ స్థలాలు భూకబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టుల ద్వారా స్వాధీనం చేసుకునేందుకు కొందరు వ్యక్తులు కుట్రలు చేస్తున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకొని అడ్డుకోవాలని, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య అన్నారు. సోమవారం తిరుపతి పుస్క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటగిరి పట్టణంలోని మేధావులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజా సంఘాలు,రాజకీయ పార్టీలు కలిసి సమావేశమై ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీగా ఏర్పడి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న పెరియవరం రెవిన్యూ గ్రామం సర్వేనెంబర్ 161-3లోని 5-32 సెంట్ల ప్రభుత్వ భూమిని అప్పటి ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం కొరకు ఎ4.29 సెంట్లు, సివిల్ సప్లైస్ గోడౌన్ కొరకు ఎ0.50 సెంట్లు, పంచాయతీరాజ్ రోడ్డు కొరకు ఎ 0.53 సెంట్లు కేటాయించిందని, ఈ క్రీడా మైదానంలో 2003 సంవత్సరంలో రాష్ట్ర స్థాయి గ్రిగ్స్ పోటీలు కూడా జరిగాయని, 2007లో అప్పటి ప్రాథమిక విద్యాశాఖ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి హాస్టల్ల సముదాయం నిర్మాణం కొరకు శిలాఫలకం వేశారని, భవన సముదాయం పునాదులు కూడా కొంతవరకు నిర్మాణం చేపట్టారని తెలిపారు. నెల్లూరు అసిస్టెంట్ సెటిల్మెంట్ ఆఫీసర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిరైత్వారీ పట్టాలు పొందినట్లుగా తప్పుడు పట్టాలు సృష్టించి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారని, 1961లో నెల్లూరు అసిస్టెంట్ సెటిల్మెంట్ ఆఫీసర్ గా పని చేసిన లుక్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించి ఫోరెన్సిక్ ల్యాబ్ కు అప్పటి నెల్లూరు కలెక్టర్ పంపారని, ఫోరెన్సిక్ ల్యాబ్ పరిశీలనలో ఫోర్జరీ అని తేలిందని, దీని ఆధారంగా నివేదిక తయారు చేసి హైకోర్టుకి సమర్పించడంతో ఆ రిట్ పిటీషన్ని కొట్టివేశారని చెప్పారు. మళ్లీ వీరు రిట్ పిటిషన్లు దాఖలు చేయడంతో ఆయా సందర్భాల్లో అప్పటి రెవిన్యూ అధికారులు, నెల్లూరు జిల్లా కలెక్టర్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంగా నిర్ధారించి కోర్టుకి నివేదికలు సమర్పించారని, కబ్జాదారులు వేసిన రిట్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేస్తూ వచ్చిందని అన్నారు. గతంలో వెంకటగిరి తాసిల్దార్, ఆర్డిఓలు ఇచ్చిన నివేదికల్లో కూడా 1961 నుంచి 2007 వరకు తమకు ఇక్కడ భూమి ఉన్నట్లుగా ఎవరూ తమ కార్యాలయాల్లో సంప్రదించలేదని తెలిపి ఉన్నారు. భూ కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి 50 కోట్ల రూపాయలు విలువచేసే ఈ స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని అప్పుడే తాసిల్దారు, ఆర్డీవోలు ఉన్నతాధికారులకు నివేదించారని, దీంతోపాటు అమ్మవారిపేట రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబర్ 199-4, 199-5, 199-6, 200-2 లలో 6ఎకరాల70 సెంట్లు భూమిని 1965 లో తాలూకా సమితి కార్యాలయం కొరకు సేకరించారని, ఈ భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసిందని, కానీ రెవెన్యూ రికార్డులలో అనుభవదారుగా సమితి బిల్డింగ్స్ అని ఉన్నప్పటికీ పట్టాదారుగా వారి పేర్లు ఉంటూ వచ్చాయని, దీనిని ఆసరా చేసుకుని కొద్ది మంది వ్యక్తులు భూమి అమ్మిన అబ్దుల్ కరీం సాహెబ్ కు మేము వారసులమంటూ రెండు కుటుంబాలను కబ్జాదారులు ముందుకు తెచ్చారని, ఇందులో సర్వేనెంబర్ 199-5 లోని ఎ.1-32 సెంట్ల భూమిపై హైకోర్టుకు తప్పుడు పత్రాలు సమర్పించారని వాపోయారు. నిజానికి సమితి బిల్డింగ్ కోసం భూమి అమ్మిన దూదేకుల కులానికి సంబంధించిన వి.అబ్దుల్ కరీం సాహెబ్ కు వారసులమని ముందుకు వచ్చిన రెండు ముస్లిం కుటుంబాలకు ఎలాంటి సంబంధం లేదని, ఈ రెండు ముస్లిం కుటుంబాలు కోర్టులకు సమర్పించిన తప్పుడు పత్రాలను గుర్తించి వాటిని ప్రభుత్వం రద్దుచేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని గతంలో రెవెన్యూ అధికారులు, నెల్లూరు జిల్లా కలెక్టర్లు అనేక సందర్భాల్లో ఇచ్చిన నివేదికలను అధ్యయనం చేసి ఈ భూమిని కాపాడుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. మేము ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గత బుధవారం నుంచి సంతకాల సేకరణ ఉద్యమం కూడా చేపట్టాం అని, ఇప్పటికి 6 వేల సంతకాలు కూడా సేకరించామని, పదివేల సంతకాలు పూర్తి చేసి త్వరలో అమరావతికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వాన్ని కలిసి వెంకటగిరిలో జరుగుతున్న భూకబ్జాలపై చర్చిస్తాం అని అన్నారు. ఈ స్థలంతో పాటు పట్టణంలో కబ్జాకు గురవుతున్న ఇతర ప్రభుత్వ స్థలాలను కూడా కాపాడే వరకు మా ఆందోళన కొనసాగిస్తామని ప్రభుత్వానికి తెలియజేచారు. ఈ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్, బి.కె ప్రసాద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వివి రమణారెడ్డి, విశ్రాంత పోస్టల్ అధికారి, ఎస్వీ నరసింహులు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివి రమణయ్య, రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి జి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# భారతరత్న డా.ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి

**- కలలను కార్యరూపంలోకి తీసుకురావడమే కలాంకు నిజమైన నివాళి**




**కుప్పం- సూర్య వాస్తవం :** కుప్పం ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీఎన్ విద్యాసంస్థల అధినేత డా.బి.సి. నాగరాజ్, డా.కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, 2003 జూన్ 7న డా. అబ్దుల్ కలాం కుప్పం ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో వివిధ అంశాలపై చర్చించిన సందర్భం జీవితాంతం మరువలేని అనుభవమని గుర్తు చేసుకున్నారు. "కలలు కనడం మాత్రమే కాదు... వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి నిరంతరం శ్రమించడం నేర్పిన మహనీయుడు డా.అబ్దుల్ కలాం" అని కొనియాడారు. ఏరోస్పేస్ శాస్త్రవేత్తగా, విద్యావేత్తగా, రచయితగా, గొప్ప వక్తగా విశిష్ట సేవలందించిన డా.కలాం భారతదేశ 11వ రాష్ట్రపతిగా దేశానికి అపూర్వ సేవలందించారని తెలిపారు. ప్రజలతో మమేకమైన నాయకుడిగా ఆయన "ప్రజల రాష్ట్రపతి"గా దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. "ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు - విద్యార్థులే దేశ భవిష్యత్తు" అనే గొప్ప భావనతో జీవించిన డా.కలాం ముందు ఒక ఆదర్శ ఉపాధ్యాయుడని అన్నారు. తమిళనాడులోని రామేశ్వరం వంటి సాధారణ ప్రాంతంలో జన్మించి, కృషి, క్రమశిక్షణ, పట్టుదలతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన ఆయన జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. డా.కలాం యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన దార్శనికుడని, శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహనీయుడన్నారు. విద్యార్థులు ఆయన ఆశయాలు, విలువలు, క్రమశిక్షణను ఆదర్శంగా తీసుకుని విజ్ఞానంతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్.భాస్కరన్, పరిశోధన విభాగాధిపతి డా.జి.ఎన్.కోదండరామయ్య, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి జె. మాధవన్, గ్రంథాలయ విభాగాధిపతి డా.సి.జి.శరవణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గంగాధరన్, కోఆర్డినేటర్ డా.అరుణ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ప్రజా సంబంధాల అధికారి ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# యోగా పోటీల్లో క్రీడాకారుల సత్తా

**- ఆరు పతకాలతో మెరిసిన స్వామి వివేకానంద ఉచిత యోగా అసోసియేషన్**




**రేణిగుంట- సూర్యవాస్తవం :** స్వామి వివేకానంద ఉచిత యోగా అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు ఇటీవల నిర్వహించిన యోగా పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి మొత్తం ఆరు పతకాలను కైవసం చేసుకున్నారు. అసోసియేషన్ తరఫున బాలచందర్, లీలావతి తలా ఒక బంగారు పతకం సాధించగా, భగవాన్ దాస్, మహేష్, జగదీష్ తలా ఒక వెండి పతకం, గుణశేఖర్ ఒక కాంస్య పతకం సాధించి రేణిగుంటకు మంచి గుర్తింపు తీసుకొచ్చారు. విజేతల విజయంపై అసోసియేషన్ సభ్యులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్ది పోటీలకు సిద్ధం చేసిన వెంకటేష్ మాస్టర్, సుబ్రహ్మణ్యం సర్‌ల సేవలను కొనియాడుతూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి రేణిగుంటకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కుప్పం ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేం

**- కుప్పంలో పరిశ్రమల స్థాపన యువతకు ఉద్యోగ అవకాశాలు**

**- ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి - రామకుప్పం పర్యటన నారా భువనేశ్వరి ఉద్ఘాటన**





**రామకుప్పం- సూర్య వాస్తవం :** ఎన్ని జన్మలెత్తినా కుప్పం నియోజకవర్గ ప్రజల రుణం ఏనాటికి తీర్చుకో లేమనీ ఎన్టీఆర్ మెమోరియల్ మేనేజింగ్ ట్రస్టి సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో మూడు రోజులు పర్యటనలో భాగంగా సోమవారం మొదటి రోజు రామకుప్పం మండలం లోని కెంచనబల్ల గ్రామంలోని యూనిట్ ఇంచార్జ్ చంద్రశేఖర్ రెడ్డి ఇటీవల నూతన గృహ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఆహ్వానం మేరకు నారా భువనేశ్వరి వారి ఇంటికి విచ్చేసి వారి కుటుంబాన్ని ఆశీర్వదించారు.

ఆమెకు చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. వారి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం నారాయణపురం తాండ గ్రామంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత నేత ఎన్టీఆర్ నిరుపేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, ఇళ్ల స్థలాలు లేని వారికి ఇల్లు నిర్మాణం కుడుగుడ్డు నినాదంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారు అన్నారు. అనంతరం ననియాల, పాంద్యాల మడుగు గ్రామాల్లో మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం దేశంలోనే గుర్తింపు ఉండేలా 30 పరిశ్రమలు తీసుకువచ్చి యువత యువకులకు నిరుద్యోగ భరోసానిస్తున్నారన్నారు.

ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి కల్పించి కుటుంబ మధ్యలోనే జీవించేలా చర్యలు చేపడుతున్నారు అన్నారు. ఈ అవకాశాలు అన్నిటిని మహిళలు సద్వినియోగం చేసుకొని వారి కుటుంబ పోషణ వారే పెంపొందించుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్, రైతులకు సంవత్సరానికి 12 వేలు చేయూత, తదితర వాటిని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. అనంతరం కావలి మడుగులో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గూర్చి వారికి వివరిస్తూ సంక్షేమాలను ప్రజలకు వివరించారు. షాహి సంస్థ ద్వారా విద్యార్థులకు సైకిళ్లు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. రామకుప్పంలోని జడ్పీ హైస్కూల్‌లో 50 లక్షలు నిధులతో డైనింగ్ హాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ముని రత్నం, డాక్టర్ సురేష్, టీటీడీ బోర్డు శాంతారాం, రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ మునుస్వామి,

మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఆనంద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, ఎంపీపీ సులోచన, గుర్రప్ప రెడ్డి, పట్రా నారాయణ చారి, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణా నాయక్, రవి రెడ్డి, నరసింహులు, చిన్ని, కృష్ణ, రఫీ, సీతాపతి, రామ్మూర్తి, బాలరాజు, ఆదిల్, శ్రీరాములు, తహసిల్దార్ కొలేష్, ఎంపీడీవో, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరుస కేబుల్ వైర్లు, వైండింగ్ వైర్ల దొంగతనం కేసులో ముద్దాయిలు అరెస్ట్

**- బంగారుపాలెం పోలీసులు**

**- సుమారు రూ.1,70,000 విలువైన చోరీ సొత్తు స్వాధీనం**



**బంగారుపాలెం- సూర్య వాస్తవం** బంగారుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ పొలాలు మరియు ఇతర ప్రాంతాల్లో కేబుల్ వైర్లు, బోరు మోటార్ కేబుల్ వైర్లు, వైన్డింగ్ వైర్ల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు బంగారుపాలెం పోలీసులు Cr.No.114/2026 U/Sec. 331(4), 305(a) BNS Cr.No.115/2026 U/Sec. 303(2) BNS కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పలమనేరు సబ్ డివిజన్ డీఎస్పీ డేగల ప్రభాకర్ పర్యవేక్షణలో, బంగారుపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.దర్యాప్తులో భాగంగా పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బంగారుపాలెం-ఎం.బి.టి. రోడ్డులోని దండువారిపల్లి బస్ స్టాప్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా మోటార్ సైకిల్‌పై వస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతడు పి. దేవరాజులు అని వెల్లడిస్తూ, కాటప్పగారిపల్లి సమీపంలోని మహా జ్యూసీ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో జరిగిన కేబుల్ వైర్ల చోరీతో పాటు ఎద్దులవారిపల్లి, కొరివివారిపల్లి గ్రామాల పరిసర వ్యవసాయ పొలాల్లోని బోరు మోటార్ కేబుల్ వైర్ల దొంగతనాలను తానే చేసినట్లు నేరాన్ని అంగీకరించాడు. నేర అంగీకారం మేరకు ముద్దాయిని అరెస్ట్ చేసి, చట్టపరమైన ప్రక్రియ అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది. **స్వాధీనం చేసుకున్న సొత్తు :** 1. మోటార్ వైన్డింగ్ వైర్లు - సుమారు విలువ రూ.30,000. 2. బోరు మోటార్ కేబుల్ వైర్లు (సుమారు 200 మీటర్లు) - విలువ రూ.60,000. 3. నలుపు రంగు పల్సర్ మోటార్ సైకిల్ -- విలువ రూ.80,000. **ముద్దాయి వివరాలు :** పి.దేవరాజులు, వయస్సు 21 సంవత్సరాలు, తండ్రి పి. వరదయ్య, స్వగ్రామం కొత్తపల్లి, యాదమరి మండలం, చిత్తూరు జిల్లా. ప్రస్తుతం డోర్ నెంబర్.8-12-81, బి టి ఆర్ కాలనీ, శెట్టిపల్లి పంచాయతీ, మంగళం, తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, రైటర్ రెడ్డప్ప, హెడ్ కానిస్టేబుల్ వినాయకం, కానిస్టేబుల్ మోహన్ నాయుడు, ముత్తు, ధనశేఖర్, వినయ్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**- ముగ్గురు మృతి - పలువురికి తీవ్ర గాయాలు - కడపల్లి వద్ద విషాదం**





**శాంతిపురం- సూర్య వాస్తవం :**కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం కడపల్లి గ్రామ పరిధిలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. స్థానికుల కథనం ప్రకారం, పలమనేరు-కృష్ణగిరి జాతీయ రహదారి పక్కన నీటి సరఫరా నిర్వహిస్తున్న ట్యాంకర్ సమీపంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన ఈచర్ వాహనం ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం తీవ్రతకు సుందరప్ప ఘటన స్థలంలోనే మృతి చెందగా, ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు వెంటనే కుప్పంలోని పి.ఇ.ఎస్ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అయితే చికిత్స కోసం తరలిస్తుండగా మునెమ్మ, సాత్విక్ ఆసుపత్రికి చేరుకునేలోపే మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. దీంతో మృతుల సంఖ్య ముగ్గురికి చేరింది. గాయపడిన వారిలో నందిని పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. అక్షయ, కనకవల్లి, సతీష్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుండగా, పూంగోడి స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.





## పేదల పొట్టపై భూ మాఫియా దాడి

**- 200 కుటుంబాల ఆందోళనతో దద్దరిల్లిన తహశీల్దార్ కార్యాలయం**

**- తరతరాలుగా సాగు చేస్తున్న 7.44 ఎకరాల భూమిపై రియల్ మాఫియా కన్ను పడిందని ఆరోపణలు**

**- "మా భూమి కాదు" అంటూ బయట వాళ్ళతో బెదిరింపులకు దిగుతున్నారని మత్స్యకారుల ఆవేదన**



**వాకాడు - సూర్య వాస్తవం :** రెండు వందల కుటుంబాల ఆందోళనతో దద్దరిల్లిన తహశీల్దార్ కార్యాలయం. పెద్దల కాలం నుంచి నమ్ముకున్న భూమిని కాపాడుకోవడానికి.. కంటికి రెప్పలా సాగు చేసుకుంటున్న నేలను అన్యాక్రాంతం కాకుండా చూసుకోవడానికి ఆ మత్స్యకారులు మరోసారి రోడ్డెక్కారు. తిరుపతి జిల్లా వాకాడు మండలం కొండూరుపాళెం మత్స్యకారుల తమ భూములను దక్కించుకోవడానికి చేపట్టిన పోరాటం తహశీల్దార్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సుమారు 200 మందికి పైగా మత్స్యకారులు ఉమ్మడిగా తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి భీకర నినాదాలతో హోరెత్తించారు.

**తరతరాల ఉపాధిపై రియల్ మాఫియా కన్ను.. సర్వే నెం. 663 భూముల పరిరక్షణకు మత్స్యకారుల పోరాటం:** దుగరాజపట్నం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 663 లో విస్తరించి ఉన్న సుమారు 7.44 ఎకరాల భూమి కొండూరుపాళెం మత్స్యకారుల జీవనాధారం. గ్రామంలోని సుమారు 270 కుటుంబాలు చేపల వేటపై ఆధారపడుతూ, ఇదే సర్వే నెంబర్లలోని భూమిని సాగుచేసుకుంటూ తరతరాలుగా జీవనం సాగిస్తున్నాయి. అయితే, ఈ భూమిపై కన్ను పడిన నెల్లూరుకు చెందిన కమలేష్ రెడ్డి అనే వ్యక్తి అనుచరులు ఇటీవల గ్రామంలోకి చొరబడి బెదిరింపులకు దిగుతున్నారు అని మత్స్యకారుల తెలిపారు. "ఇది మీ భూమి కాదు" అంటూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఈ ఘటనలు మత్స్యకారుల తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి వారు తెలిపారు.

**అధికారుల పాత్రపై తీవ్ర ఆరోపణలు - లంచాలకు తలొగ్గి పత్రాల తారుమారు :** ఒక గ్రామానికి చెందిన 200 మత్స్యకారుల కుటుంబాలు రోడ్డెక్కి ఇబ్బందులు పడుతున్నా తహసీల్దార్ కార్యాలయ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. లంచాలకు తలొగ్గి, రికార్డులను తారుమారు చేసి కబ్జాదారులకు అప్పగిస్తున్నారు" అంటూ మత్స్యకారుల తీవ్రంగా ఆరోపించారు. అధికారుల మౌనం, అక్రమార్కులతో కుమ్మక్కైన వైనం స్పష్టంగా కనిపిస్తోందని, పేదల పొట్ట కొట్టి కోట్ల విలువైన భూమిని కట్టబెట్టే కుట్ర జరుగుతోందని వారు మండిపడ్డారు.

**కొండూరుపాళెం కాపులు, మత్స్యకారుల ప్రధాన డిమాండ్లు :** సర్వే నెంబర్ 663 లో కమలేష్ రెడ్డి పేరును తక్షణమే తొలగించి, తిరిగి ప్రభుత్వ భూమిగా మార్చాలి. సదరు భూమిని గ్రామ ప్రజల నిరంతర అనుభవంలో ఉండేలా చట్టపరమైన రక్షణ కల్పించాలి. గ్రామంలోకి అన్యులు, భూ కబ్జాదారులు రాకుండా నిషేధించి, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామ పర్యటనకు వచ్చి, భూములను సర్వే చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి భూ హక్కు కల్పించాలి. గూడూరు శాసనసభ్యుల సమక్షంలో గ్రామసభ ఏర్పాటు చేసి, భూమి లేని ప్రతి పేద కుటుంబానికి భూ పంపిణీ కార్యక్రమం చేపట్టాలి.

**భూ పంపిణీ చేయకపోతే ప్రజాప్రతినిధుల కార్యాలయాల ముట్టడి మత్స్యకారుల హెచ్చరిక :** ఇప్పటివరకు గ్రామంలోని ప్రజలందరూ ఉమ్మడిగా భూమిని సాగుచేస్తున్నామని, భవిష్యత్తులో భూ పంపిణీ ద్వారా ప్రతి ఒక్కరికీ వేర్వేరుగా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరితగతిన స్పందించి న్యాయం చేయకపోతే రానున్న రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముట్టడిస్తామని మత్స్యకారుల హెచ్చరించారు. అభాగ్యులైన మత్స్యకారుల పొట్టకొడితే చూస్తూ ఊరుకోమని తేల్చిచెప్పారు.

## జీడి నెల్లూరు సింగల్ విండో సీఈవోగా మునస్వామి



**గంగాధర నెల్లూరు- సూర్య వాస్తవం :** గంగాధర నెల్లూరు సింగల్ విండో సొసైటీ ఇన్చార్జ్ సీఈఓగా కె.మునస్వామి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. సింగల్ విండో సొసైటీలో స్టాఫ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మునుస్వామికి ఇంచార్జ్ సీఈవో బాధ్యతలను జిల్లా డీసీసీబీ సీఈఓ శంకర్ బాబు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ సీఈఓగా పనిచేసిన విజయ్ కుమార్ రెడ్డి పదవీ విరమణ పొందడంతో రెండు నెలలపాటు జీడీ నెల్లూరు డిసిసి బ్యాంక్ సూపర్వైజర్ చంద్ర శేఖర్‌ను ఇన్చార్జి సీఈఓ నియమించారు, ప్రస్తుతం సొసైటీలో స్టాఫ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.మునుస్వామికి ఇన్చార్జ్ సీఈవో బాధ్యతలను అప్పగించినట్లు ఆయన తెలిపారు.

## కలశ పూజలో పట్టు వస్త్రాల సమర్పణ



**రామచంద్రపురం- సూర్య వాస్తవం :** మండలంలోని బొప్పరాజు పల్లి గ్రామంలో సాయిబాబా దేవాలయం నందు గురు పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం ఉదయం కలశ పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బట్టే మారయ్య, రాణేమ్మ కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించి స్వామివారికి మంగళ వాయిద్యాలు, భక్త భజనలు, సాయిరాం సంకీర్తన నడుమ ఊరేగింపుగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ డి విందు మాధవి పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించారు. ఉదయం 6 గంటలకు శ్రీ షిరిడి సాయిబాబా మూల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారి సేవలు విశేషంగా పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాదురు కోటేశ్వర్ రెడ్డి బండి విజయ్ కుమార్ రెడ్డి, బొడ్డుసోము రాయల్, పంతల వెంకటేష్ నాయుడు టి వెంకటేష్ రెడ్డి ఆవుల సిద్దయ్య యాదవ్, దేవరాజులు రెడ్డి, లో శెట్టి రూపు రాయల్, జి. మహేష్ రాయల్, బీసీ సెల్ అధ్యక్షులు కే కుమార్, కారే రూపుచంద్ర రాయల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## దస్తలేఖరుల సమస్యలు పరిష్కరిస్తాం

- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబుకు వినతిపత్రం



**రాయచోటి – సూర్య వాస్తవం :** రాయచోటి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న దస్తలేఖరులు (డాక్యుమెంట్ రైటర్లు) సోమవారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబును కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన దస్తలేఖరులు, ప్రభుత్వం అమలు చేస్తున్న జి.ఓ. నెం.396 కారణంగా తమ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న తమ వృత్తి సంక్షోభంలో పడిందని, దీంతో తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. ప్రభుత్వం ఈ ఉత్తర్వులను పునఃసమీక్షించి దస్తలేఖరుల ప్రయోజనాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వినతిని శ్రద్ధగా ఆలకించిన సుగవాసి ప్రసాద్ బాబు, దస్తలేఖరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద ప్రస్తావించి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని, ప్రతి వర్గానికి అండగా నిలుస్తూ వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## అర్ధరాత్రి చెట్లు మాయం



**పుంగనూరు– సూర్య వాస్తవం :** మండ లంలోని రాగానిపల్లె వద్ద గల మల్లుపల్లె క్రాస్‌లో రాత్రిపూట చెట్లు నరికి తీసుకెళ్తున్న సంఘటన సోమవారం వెలుగుచూసింది. గ్రామస్తులు తెలిపిన మేరకు కొంత మంది చెట్లను నరికి తీసుకెళ్తున్నారని, ఈవిషయమై రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న చెట్లను తక్షణమే కాపాడి, పర్యావరణ కాలుష్యానికి ముప్పు వాటిల్లకుండ చూడాలని కోరారు.

## క్యాన్సర్ బాధితుడికి రూ.3 లక్షలు



**పుంగనూరు– సూర్య వాస్తవం :** పట్టణం లోని రహమత్‌నగర్‌లో నివాసం ఉన్న ఎస్.బావాజాన్ క్యాన్సర్‌వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక మైనార్టీ నాయకులు రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డికి తెలిపారు. దీనిపై స్పందించిన మిధున్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రధానమంత్రి సహాయనిధి నుంచి బాధితుడికి రూ.3 లక్షలు విరాళంగా నిధులు మంజూరు చేయించారు. సోమవారం మాజీ మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ కన్వీనర్ ఫక్రుద్దీన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము , మైనార్టీల కార్యదర్శి మహబూబ్‌బాషా, కాపు సంఘ నాయకుడు కొండవీటి నరేష్, పట్టణ మైనార్టీ కార్యదర్శి అజీజ్ లు కలసి బాధితుడికి రూ.3 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం ఎంపి మిధున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## జపాన్ కరాటే పోటీలకు పుంగనూరు విద్యార్థులు ఎంపిక



**పుంగనూరు– సూర్య వాస్తవం :** జపాన్ దేశంలో సెప్టెంబర్ నెలలో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు పుంగనూరు నుంచి కరాటే విద్యార్థులు ఎంపికయ్యారని కరాటే మాస్టర్ మహేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీలలో మైసూర్‌లో జరిగిన ఆల్‌ఇండియా షిటోర్యూ కరాటే ఛాంపియన్ పోటీల్లో పట్టణానికి చెందిన తాన్వేశ్వర్‌కుమార్‌రెడ్డి, శశాంత్, త్రివిక్రమ్‌లు బంగారు పథకాలు సాధించారన్నారు. 20 సంవత్సరాలలోపు కటావిభాగంలో జుహా ఫాతిమా బంగారు పథకము, శ్రేష్ఠ కాంస్యపథకము సాధించిందన్నారు. ఎం.రెడ్డిమహేష్ కుమితే విభాగంలో ఎంపికైయ్యారన్నారు. ఈ విజేతలు జపాన్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపికై య్యారని తెలిపారు. వీరిని కర్నాటక క్రీడలశాఖ మంత్రి అరుణ్‌మచ్చయ్య తదితరులు అభినందించారు.

## ఇంటింటికీ తెలుగుదేశం ప్రారంభించిన మారెడ్డి జోగిరెడ్డి



**పులివెందుల– సూర్య వాస్తవం :** సోమవారం పులివెందుల మున్సిపాలిటీలోని పిజియో థెరపీ సాయి కిషోర్ క్లినిక్ వద్ద నుంచి “ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్)” కార్యక్రమాన్ని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ పులివెందుల పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, తూగుట్ల మధుసూదన్ రెడ్డి, టీడీపి మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దురు వెంకట్రామిరెడ్డి నల్లాగారి భాస్కర్ రెడ్డి, ఎర్ర జగదీష్ రెడ్డి పిజియో థేరపి సాయి కిషోర్ లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లాస్థాయి సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులకు ఏర్పాట్లు పూర్తి



**పీలేరు– సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా కేంద్రంగా పీలేరు పట్టణంలో ఈ నెల 31 వ తేదీ నుంచి ఆగస్టు 2 వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ పిలుపునిచ్చారు. దేశ, రాష్ట్ర రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన పెంపొందించి ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పోరాడే దిశగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, విద్యా -వైద్య రంగాల వాణిజ్యీకరణ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవినీతి, నీట్ ప్రశ్నాపత్రం లీక్ వంటి విద్యారంగ సమస్యలతో పాటు సమకాలీన అంశాలపై లోతైన చర్చలు, బోధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై స్పష్టమైన అవగాహనతో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే ఈ శిక్షణ తరగతుల ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్యతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రొఫెసర్లు, మేధావులు, ప్రజా ఉద్యమ నాయకులు హాజరై రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై ప్రత్యేక ప్రసంగాలు చేయనున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొనే వారికి సమకాలీన పరిస్థితులు, ప్రజా సమస్యలు, ఉద్యమాల దిశ, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఇది కేవలం పార్టీ అంతర్గత కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలందరికీ ఉపయోగపడే విజ్ఞాన వేదిక అని టీఎల్ వెంకటేష్ పేర్కొన్నారు. సీపీఐ పార్టీ శ్రేణులతో పాటు భారత యువజన సమాఖ్య, భారత విద్యార్థి సమాఖ్య, కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, రైతు సంఘాలు, యువత, విద్యార్థులు, మహిళలు, మేధావులు, ప్రజాస్వామ్య విలువలను విశ్వసించే ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పీలేరు నుంచే ప్రజా ఉద్యమాలకు మరింత బలం చేకూర్చే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సమాజంలో మార్పు కోసం చర్చిద్దాం, నేర్చుకుందాం, కలిసి నడుద్దాం అనే సందేశంతో ముందుకు సాగాలని టీఎల్ వెంకటేష్ పిలుపునిచ్చారు.

## ఎస్‌సీల సంక్షేమానికి వైఎస్సార్, జగన్ ప్రభుత్వాలే పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ ఎస్‌సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి - గడికోట శ్రీకాంత్ రెడ్డి



**రాయచోటి– సూర్య వాస్తవం :** దళితుల సంక్షేమం, సామాజిక సాధికారత కోసం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ఎస్‌సీ సెల్‌కు నూతనంగా నియమితులైన నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులుగా నియమితులైన సీతారాం, బాలాజీ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా రామాంజనేయులు, చంద్రహాసన్, ఓబులేసు, మండల సభ్యుడిగా నాగార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు దళితుల మనోభావాలను దెబ్బతీశాయని విమర్శించారు. వైఎస్సార్, జగన్ ప్రభుత్వాల హయాంలో దళితవాడల్లో పక్కా గృహాలు, సీసీ రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలుతో దళిత కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ఆ అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారి అభ్యున్నతికి కృషి చేసిన వైఎస్సార్, జగన్ ప్రభుత్వాల పట్ల తమకు ప్రత్యేక కృతజ్ఞతాభావం ఉందని నాయకులు తెలిపారు. అనంతరం గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, రాయచోటి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎస్‌సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి దళితుల సమస్యల పరిష్కారానికి పార్టీ అండగా నిలుస్తుందని చెప్పారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు దళితుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్‌సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కా అంజనప్ప, నియోజకవర్గ అధ్యక్షుడు సగినాల శివశంకర్, జిల్లా కార్యదర్శులు మీసాల ఆంజనేయులు, మదనమోహన్, జాలా మహేష్, నాయకులు యండపల్లె పవన్, గంగాధర్, పోశాల అఖిల్, సందీప్, ఓబులేసు, వెంకటాద్రి, రెడ్డిబాబు, వాసు, నాగరాజు, అయ్యప్ప, వెంకటేశ్వర్లు, రాచరాయుడు, బాలు, ధన, దేవేంద్ర, నాగేంద్ర, జయరామయ్య, రామాంజి, సన్నీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ

- డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలి
- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్




**రాయచోటి– సూర్య వాస్తవం:** రాష్ట్రంలో మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో “తొలి సంతకం డీఎస్సీపైనే” అని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్సీని అవినీతి, అక్రమాలకు వేదికగా మార్చిందని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ విద్యార్థులను పక్కనబెట్టి ఉద్యోగాల కేటాయింపులో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తమకు అనుకూలంగా ప్రత్యేక జీవోలు తీసుకొచ్చి, పని పూర్తయ్యాక వాటిని రద్దు చేయడం ప్రభుత్వ దురుద్దేశానికి నిదర్శనమని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాల వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు వెలికితీయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పూర్తిగా స్తంభించడంతో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని విమర్శించారు. డీఎస్సీ అవకతవకలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలపై జూలై 28 న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన ర్యాలీలో నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శిబ్యాల విజయభాస్కర్ పిలుపునిచ్చారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )